క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్‌గా విష్ణుప్రసాద్



గోనెగండ్ల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విష్ణుప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణగిరి మండలంలో పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న లక్ష్మీరాజు బదిలీపై కృష్ణగిరి వెళ్లారు. నూతన డీటీ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆయనను పూల మాలతో సత్కరించారు.

ఎమ్మిగనూరుకు అదనపు కోర్టులు మంజూరు



జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరుకు అదనంగా ఒక సబ్ కోర్టుతో పాటు ఐదు అడిషనల్ సివిల్, క్రిమినల్ కోర్టులు మంజూరైనట్లు స్థానిక జూనియర్ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు తెలిపారు. ఈ మేరకు గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల ప్రయత్నాలు ఫలించాయని న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, న్యాయవాదుల కృషే ఇందుకు కారణమన్నారు. అసోసియేషన్ కార్యదర్శి రఘురాం,న్యాయవాదులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు అవసరం



రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాలను విస్తరిస్తేనే పట్టణాలు అభివృద్ధి దిశలో పయనిస్తాయని వైఎస్సార్‌సీపీ వీరశైవ లింగాయత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్క్ రోడ్‌లో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసిన రిలయన్స్ స్మార్ట్ బజార్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు కుమార్‌గౌడ్, పురుషోత్తం గౌడ్, రిలయన్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం అంపయ్య

మంత్రాలయం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.అంపయ్య తెలిపారు. శుక్రవారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన టి.సోమేష్, అండర్-17 విభాగంలో కె.చరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కెట్‌యార్డ్‌లో సమస్యలు పరిష్కరించండి



మార్కెటింగ్ శాఖ ఏడీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న కోరారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ తనిఖీ చేసిన ఆ శాఖ ఏడీఎం నారాయణ మూర్తికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెట్‌కు తెచ్చిన సమయంలో వర్షం కురిస్తే అవి తడిచి పోయి రైతులు నష్టపోతున్నారని, వెంటనే అదనపు షెడ్లు నిర్మించాలని కోరారు.యార్డ్‌లో పత్తిని కొనుగోలు చేయాలని, దళారుల దోపిడీని అరికట్టాలని, రైతులకు విశ్రాంతి భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు పాల్గొన్నారు.

అడియాశలు!

- ఈ ఏడాది అన్నదాత సుఖీభవకు మంగళం
- రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామన్న కూటమి నాయకులు
- ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు
- రబీ పంటల సాగుకు ఇక్కట్లు

గత ఐదేళ్లు రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడకుండా వైఎస్సార్ రైతు భరోసా పేరుతో నాటి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. అదే పథకాన్ని కాపీ కొట్టిన కూటమి నాయకులు.. ఏటా పంటల సాగుకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా పథకం అమలు ఊసెత్తడం లేదు. దీంతో అన్నదాతలు వడ్డీలకు తెచ్చుకొని పంటలు సాగు చేస్తున్నారు.

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అని పేరు మార్చిందే తప్ప అమలుకు పూనుకోలేదు. చివరకు కనీస కార్యాచరణ లోపించడంతో రైతులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. మండలంలో రబీ కింద అధిక శాతం రైతులు శనగ పంట సాగు చేస్తారు. వైఎస్సార్‌సీపీ పాలనలో శనగలకు 40 సబ్సిడీ ఇస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ రేటును అధికంగా చూపి కేవలం 25శాతంతో సరిపెట్టింది. మండలంలో 16,619 మంది రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, పత్తి, మిరప, ఉల్లి, సజ్జలు, కొర్ర తదితర పంటలను 43,850 ఎకరాల్లో సాగు చేశారు.

అంతంతమాత్రంగా దిగుబడి

కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేయకపోవడంతో చిన్న,సన్నకారు రైతులు ఖరీఫ్ సాగుకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టిబడి పెట్టారు. వర్షభావ పరిస్థితులు, అధిక వర్షాలతో ఖరీఫ్ పంటల నుంచి దిగుబడి అంతంతమాత్రంగానే వచ్చింది. దీంతో వారికి పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి. రబీ సీజన్‌కు ముందు అందజేస్తుందేమోనని ఆశించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి.



గోనెగండ్లలో సాగైన సజ్జ పంట

పథకం సొమ్ము అందకపోవడంతో అన్నదాతలు మళ్లీ రుణదాతల వద్ద చేయిచాచాల్సి వస్తోంది.

గత ఐదేళ్లు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ఏటా సీజన్‌కు ముందుగానే రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేసింది. ప్రతి ఏడాది రైతుకు రూ.13,500 చెల్లించేది. ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500 ఖరీఫ్ కోత, రబీ అవసరాల కోసం అక్టోబర్‌లో రూ. 4 వేలు, జనవరిలో పంటకోతల సమయంలోనూ రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి రైతులకు అండగా నిలిచింది. అయితే కూటమి ప్రభుత్వం కేవలం పథకం పేరు మార్చి చేతులు దులుపుకోవడంతో కర్షకులకు కష్టాలు తప్పడం లేదు.

పెట్టుబడికి ఇబ్బందులు



జగనన్న పాలనలో ప్రతి ఏడాది రైతు భరోసా డబ్బులు వచ్చేవి. పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడేవి. నేడు ఆ పరిస్థితి లేదు. అధికారంలో వస్తే రూ.20వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు ఇంతవరకు పట్టించుకోలేదు. ఆ సొమ్ము రాకపోవడంతో ఖరీఫ్ పంటల సాగు పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. రబీలోపు ఇస్తారని ఎదురుచూసినా ఇప్పుడు కూడా అందకపోవడంతో మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది.

– రాముడు, రైతు గంజిహళ్లి

సాయం అందించాలి



గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించేది. దీంతో మాకు కొంతమేరు ఆర్థిక ఇబ్బందులు తీరేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ ముగిసినా పెట్టుబడి సాయం అందలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20వేలు అందజేస్తే రబీ సాగుకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

– భాస్కర్ రెడ్డి, రైతు, గోనెగండ్ల

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దుర్గప్ప అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై 6 బాక్సుల (90 ఎంఎల్ పరిమాణం గల) మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పెసలబండ గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి విచారించగా కర్ణాటక రాష్ట్రం నగరహాల్ గ్రామం నుంచి 576 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తున్నట్లు చెప్పాడన్నారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

నందవరం: మండలంలోని నాగలదిన్నె, నదికైరవాడి, సోమలగూడూరు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో అధికారులు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. శుక్రవారం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీఓ పుల్లయ్య, నాగలదిన్నె గ్రామ సర్పంచ్ లక్ష్మీ నేతృత్వంలో వరద కాలనీ, బీసీ కాలనీ సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ట్యాంక్ బండ్ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. పట్టణ వాసులు తడి,పొడి చెత్తను కార్మికులకు ఇచ్చి సహకరించాలని కోరారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి



విద్యుత్ శాఖ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్: టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపునకు పూనుకోవడం దారుణమని, వెంటనే ఈ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యవర్గ సభ్యుడు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిందని, అలాగే విద్యుత్ మోటార్లకు మీటర్లను రద్దు చేస్తామని చెప్పిందన్నారు. అయితే ప్రస్తుతం విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.8,114 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రతిపాదనలు చేయడం, ఇందుకు నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. ప్రస్తుతం పేద ప్రజలపై రూ.20 వేల కోట్లు భారం పడుతుందన్నారు. ప్రయివేట్ విద్యుత్ కంపెనీల దోపిడీ, అధిక రేట్లకు పవర్ ఎక్స్ఛేంజీలతో స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలులో అవినీతి అక్రమాల వల్ల భారం పెరిగిందన్నారు. సత్వరమే సర్దుబాటు చార్జీలను ఉప సంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ కార్యాలయం ఇన్‌చార్జ్ టెక్నికల్ ఏఈ విజయరత్నంరాజుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు కృష్ణమూర్తి, అజీం ఖాన్, హరి తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీల భారం మోపొద్దు



విద్యుత్ శాఖ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపవద్దని సీపీఎం నాయకులు గోవిందు,రాముడు,సురేష్ కోరారు. విద్యుత్‌చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ యూడీసీ సల్మాన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపారని మండిపడ్డారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటుతున్నాయని, ప్రస్తుతం విద్యుత్ చార్జీల పేరుతో మారోసారి భారం మోపాలనుకోవడం దారుణమన్నారు. సీఐటీయూ,డీవైఎఫ్ఐ నాయకులు రమేష్, రవి, చేనేత కార్మిక సంఘ నాయకుడు కాలప్ప పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌ఏపీఎఫ్ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ కళాశాల ముందు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదోనిలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపి వేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రారంభం కొరకు సిబ్బందిని కూడా నియమించిందని ఇప్పుడు పనులు ఆగిపోవడం, తరగతులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఆర్‌ఏపీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుపరిపాలన అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: గ్రామాల్లో సుపరిపాలన అందించాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. పరిపాలన అధికారి సత్యన్న అధ్యక్షతన వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్బారాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలపై అవగాహన, ఎదుర్కోవాల్సిన పరిస్థితిపై వివరించారు. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శులు అబ్దుల్‌కరీం, శివప్ప, శ్రీరాములు, మంజునాథ్, హుసేనమ్మ, శ్రీనాథ్‌రెడ్డి, విక్రమ్‌కుమార్, అబ్దుల్‌వహీద్ పాల్గొన్నారు.

నందవరం : పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి సహకారించాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లుకు గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సూపరిండెంటెంట్ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, పంచాయతీ కార్యదర్శులు రామారావు, జ్యోతి, సుజాత, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

గోనెగండ్ల: గ్రామాల అభివృద్ధిలో వార్డుల సభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీఓ మణిమంజరి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పనుల తీర్మానంలో సంతకాలు చేసే సమయంలో తీర్మానాన్ని పూర్తిగా చదివిన తరువాతనే సంతకం చేయాలని సూచించారు. ఈఓఆర్డీ అనంత సేన, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

చిన్నారుల చికిత్సకు ప్రత్యేక విభాగం



మాట్లాడుతున్న డాక్టర్ కె.నవీన్‌కుమార్

ఆదోని అర్బన్: అనారోగ్య సమస్యలతో బాధపడే చిన్నారుల కోసం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు చిన్నపిల్లల వైద్య నిపుణులు కె.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం నూతన విభాగంలో చిన్నారులను పరీక్షించి వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు ఎదుగుదల లేకపోవడం, అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి ఈ బ్లాక్‌లో అడ్మిట్ చేసుకుని అన్నిశాఖల వైద్యాధికారులు సేవలు అందిస్తారన్నారు. పిల్లల తల్లిదండ్రులు ధైర్యంగా ఆస్పత్రికి రావొచ్చన్నారు. అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి



అగసనూరులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోసిగి మండలంలోని సాతనూరు, అగసనూరు, కందుకూరు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోసిగి మండలంలోని వివిధ గ్రామాలకు మొదట విడతగా రూ.2.50 కోట్ల నిధులతో 38 ప్రాంతాల్లో సీసీ రోడ్డు వేయించడం జరుగుతుందన్నారు. అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, పీఆర్ డీఈ రంగస్వామి, ఏపీడీ లోకేశ్వర, పీఆర్ ఏఈ మాలిక్, ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం సత్యమ్మ, సాతనూరు, అగసనూరు, కందుకూరు గ్రామ సర్పంచ్‌లు మంగమ్మ, వడ్డె ఉలిగయ్య, హనుమంతి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలతో స్వాగతం



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో 'పల్లె పండగ' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి గ్రామస్తులు సమస్యలతో స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి వీధిలో ఎమ్మెల్యే తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు చెప్పారు. చాలామందికి వృద్ధాప్య, వితంతు పింఛన్లు రావడం లేదని, రేషన్ కార్డులు లేవని, వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జనవరి తర్వాత తల్లికి వందనం, ఇతర సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. నాయకులు మల్లప్ప, దేవేంద్రప్ప, కృష్ణమ్మ, గ్రామనాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో సమస్యల పరిష్కారం



బనవాసి గ్రామ సభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ కుమారస్వామి

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలతో ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బనవాసి గ్రామ సచివాలయంలో గ్రామ సభను నిర్వహించి సమస్యలపై రైతుల నుంచి వినతులను స్వీకరించారు.రెవెన్యూ పరమైన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తహసీల్దార్ శేషఫణి,రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జ్యోతిర్మయి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నందవరం : రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు రీ సర్వే తహసీల్దార్ మహేష్, మండల సర్వేయర్ అక్బర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ..భూమి విస్తీర్ణంలో తేడాలు, ఒకే సర్వే నంబరుల్లో అన్నదమ్ముల విభాగాలకు సంబంధించి అర్జీలను పరిష్కరిస్తామని వివరించారు. ఎల్‌పీ నంబర్లు తేడాలు ఉన్న రైతులు అర్జీలు అందజేయవచ్చని చెప్పారు. రైతుల అర్జీలను 15 రోజుల లోపు పరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ జెర్మియా పాల్గొన్నారు.

గోనెగండ్ల: రెవెన్యూ గ్రామ సభల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రబాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీ సర్వే జరిగిన గ్రామంలో ఎవరికైనా భూ సమస్య ఉంటే దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. సదస్సులో దాదాపు 100 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రీ సర్వే డీటీ శిరీష, ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

నారాయణపురంలో రెవెన్యూ సదస్సు

ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ శివరాముడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు రీసర్వే భూ సమస్యలపై అర్జీల రూపంలో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. జాయింట్ పట్టాదారు పాసుపుస్తకం, పేర్లు తప్పుగా నమోదుకావడం, ఇనామ్ భూమి అని తప్పుగా నమోదైన వివరాలను సరి చేయాలని రైతులు అర్జీలు సమర్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. వాటిని విచారించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, వీఆర్వో కళ్యాణి, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కాచాపురంలో గ్రామసభ

మంత్రాలయం: రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామ సభను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవి సూచించారు. శుక్రవారం మండలంలోని కాచాపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల ఎల్‌పీ నంబర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణంలో తేడాలు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమస్యలున్న రైతులు అర్జీలు సమర్పించాలని సూచించారు. ఆర్ఐ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో తహసీల్దార్ నిత్యానందరాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని కలువలగుండు పొలాలకు సంబంధించి రీసర్వే అభ్యంతరాలపై రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కలువలగుండు రెవెన్యూ గ్రామ పరిధిలో 574.90 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. ఇందుకు గానూ ఎల్‌పీఎం నంబర్లు 358 ఉన్నట్లు తెలిపారు. ఈ భూముల రీసర్వేకు సంబంధించి కొలతలు, వివిధ రకాల సమస్యలు ఉంటే అర్జీ రూపంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

21న మెగా జాబ్‌మేళా

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్.మురళీబాబు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. హీరో, పేటీఎం, డిక్సమ్, భారత్ ఎఫ్ఐహెచ్, బ్లూస్టార్ వంటి కంపెనీలతో పాటు 20కిపైగా నేషనల్, మల్టీనేషనల్ కంపెనీల్లో టెక్నికల్, నాన్ టెక్నికల్‌లో దాదాపు 16 వేలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హతలు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని రాంజల రోడ్డులో ఉన్న డిగ్రీ కళాశాలలో 21న ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, నిరుద్యోగ యువత విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెజ్యూమ్ తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 98662 78735 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆదోనిలో మోస్తరు వర్షం



ఎస్‌కేడీ కాలనీలో జలమయమైన రోడ్డు

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఓ మోస్తరు వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వరద నీటితో ప్రధాన రోడ్లు, కూడళ్లు, మురుగు కాలువలు నిండిపోయాయి. డ్రైనేజీలు నిండి పొంగి ప్రవహించడంతో పాదాచారులు, స్కూటరిస్టులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. పాత బస్టాండు సర్కిల్, భీమాస్ సర్కిల్, జైన్ టెంపుల్ రోడ్డు, తిక్కస్వామి దర్గా ఏరియా, హవన్నపేట, కొడల్‌పేట తదితర ప్రాంతాల్లో ఆవుదొడ్డి వంక, శ్రీనివాసభవన్, ఆర్టీసీ కాలనీ, ఎస్‌కేడీ కాలనీ తదితర ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపై మోకాళ్లలోతు ప్రవహించింది. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే ఉద్యోగులు, ఆయా పనులు మీద పట్టణానికి వచ్చిన రైతులు, వ్యాపారులు, పాఠశాల నుంచి ఇంటికే వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఏళ్లు గడుస్తున్నా ఆదోని అభివృద్ధి అటుంచితే, చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు రోడ్లపైకి చేరుతోందని, ప్రజల ఇబ్బందులను పట్టించుకునే పాలకులు కరువయ్యారని పట్టణవాసులు మండిపడుతున్నారు.